www.prajaswaramdaily.com

# ప్రజాస్వరం

PRAJASWARAM

తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి : 17 | సంచిక : 284 | పేజీలు : 4 | వెల : 1

Circulated By : Hyderabad- Medak - Sangareddy - Nalgonda - Warangal - Nizamabad- Vijayawada- Guntur - Vizag - Adilabad- kurnool | సోమవారం 24-06-2024

MHR TV

www. mhrtv.com



హైదరాబాద్ లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీసీ భవనం

## సిద్ధమవుతున్న సీఎం క్యాంపు ఆఫీసు

- ఎంసీఆర్ హెచ్ఆర్డీసీలో కొనసాగుతున్న ఏర్పాట్లు
- ఆరు నెలలైనా క్యాంపు ఆఫీసు లేకపోవడంతో ఇబ్బందులు
- ఇల్లు, సచివాలయం నుంచే పనికానిచ్చేస్తున్న సీఎం
- 45 ఎకరాల్లో ఎంసీఆర్ ప్రాంగణం
- ఆడిటోరియం, బోర్డు రూమ్, ప్రత్యేక బ్లాకులు
- పనులను పర్యవేక్షిస్తున్న రోడ్లు, భవనాల శాఖ

**హైదరాబాద్, జూన్ 23, (ప్రజాస్వరం) :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోసం ప్రభుత్వం కొత్త క్యాంపు కార్యాలయాన్ని సిద్ధం చేస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 6 నెలలవుతున్నా, నేటి వరకు ఆయనకంటూ ప్రత్యేకంగా క్యాంపు కార్యాలయం లేదు. ప్రభుత్వ సమీక్షలు వగైరాలను ఇప్పటివరకు ఇంటినుంచి లేదా సచివాలయం నుంచే నిర్వహిస్తూ వచ్చారు. గత ప్రభుత్వ హయంలో సీఎం అధికార నివాసాన్ని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆ భవనాన్ని ప్రజాభవన్ గా పేరు మార్చి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారిక నివాసంగా మార్చ గా, మరో భాగంలో మంగళ, శుక్రవారాల్లో ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమానికి వాడుతున్నారు. ప్రస్తుతం ఎన్నికల హడావుడి ముగియటంతో సీఎం పాలన మీద ప్రత్యేకంగా దృష్టిపెట్టటంతో బాటు రోజూ సీఎం ను కలిసేందుకు వందలాది సందర్శకులు రావటంతో ముఖ్యమంత్రి కోసం పూర్తి **మిగతా 2 లో..**

# నిరుద్యోగాన్ని నిర్మూలిస్తాం

- యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనే ప్రభుత్వ ధ్యేయం
- మరో.. లక్షా డెబ్బైవేల ఉద్యోగాలు ఇచ్చేందుకు చర్యలు
- నైపుణ్య శిక్షణ ఇవ్వడంపై దృష్టి సారిస్తున్నాం
- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్
- వికారాబాద్ జిల్లా కేంద్రంలో మెగా జాబ్ మేళా
- 70 కంపెనీల్లో 5000 ఉద్యోగాల భర్తీ చేసేందుకు ఏర్పాటు
- పెద్దఎత్తున హాజరైన నిరుద్యోగ యువత



మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్

**వికారాబాద్, జూన్ 23, (ప్రజా స్వరం ):** నిరుద్యోగ నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ఆదివారం వికారాబాద్ పట్టణ కేంద్రంలోని నర్సింగ్ ఫంక్షన్ హాల్ లో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ముందుగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సునీతా మహేందర్ రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మంజులా రమేశ్, ఎంపీపీ చంద్రకళ , మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి లతో కలిసి స్పీకర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మెగా జాబ్ మేళాలో 70 కంపెనీలలో 5000 ఉద్యోగాలకు 18 నుంచి 35 సంవత్సరాల వయసు గల నిరుద్యోగులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యా అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జాబ్ మేళాకు విచ్చేసిన అభ్యర్థుల ను ఉద్దేశించి స్పీకర్ గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన అతి తక్కువ కాలంలోనే 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని, ఇంకా లక్షా 70 వేల ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.

యువతకు వ్యక్తిగత నైపుణ్యతలో శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధితో వృద్ధిలోకి వచ్చే విధంగా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో కడ (కొడంగల్ ప్రాంత అభివృద్ధి సంస్థ) ద్వారా పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా ముమ్మర చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన పనులు చేయడంతో పాటు, ఐదు సంవత్సరాల్లో నిరుద్యోగ సమస్యను తీరుస్తామని తెలిపారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సునీతా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతకు మెగా జాబ్ మేళా ఎంతగానో దోదపడుతుందన్నారు. దేశానికి యువకులు వెన్నె ముక లాంటి వారని, ఉద్యోగాలు లేవని చింతించకుండా వ్యవసాయ రంగంలో కూడా రాణించాలని ఆమె సూచించారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ యువత విద్యతో పాటు తమలోని ప్రతిభను కూడా మెరుగుపరుచుకో వాలన్నారు.

మెగాజాబ్ మేళా లో వచ్చిన ఉద్యోగంలో చేరాలని, తమ గౌరవానికి, ప్రతిష్టకు ఇది మంచి అవకాశం అని పేర్కొన్నారు. యువత ఉద్యోగాలను పొంది తమ కుటుంబాలకు భరోసాగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా మెగాజాబ్ మేళాలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. మెగాజాబ్ మేళాలో ఉద్యోగుల ఎంపిక ప్రక్రియను నిర్వాహకులను ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లిగ్యా నాయక్, అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, టీజీ స్టెప్ మేనేజర్ వేణుగోపాల్ రావు, జడ్పీ సీఈవో సుధీర్, డీవైఎస్ఓ హనుమంతరావు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఖమ్మం కోలుకునేది ఎలా..?

**అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఘోర పరాజయం**

**బీఆర్ఎస్ శ్రేణుల్లో నైరాశ్యం**

**ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కంచుకోట అని మరోసారి రుజువు**

**ఖమ్మం, జూన్ 23 (ప్రజాస్వరం) :** ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి భారీ కోలుకోలేనంత నష్టం కలిగింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఉమ్మడి జిల్లాలో పదికి పది స్థానాలు కాంగ్రెస్ ఖాతాలో ఉన్నాయి.. అయితే తాజాగా జరిగిన ఎంపీ ఎన్నికల్లో ఖమ్మం సిట్టింగ్ సీటును కోల్పోయింది. రికార్డు మెజార్టీ తో కాంగ్రెస్ విజయం సాధించగా.. బీఆర్ఎస్ కోటకు బీటలు పడడంతో.. ఆ పార్టీ ఓటు బ్యాంక్ చెల్లా చెదురై కాంగ్రెస్, బీజేపీ క్రాస్ అయ్యాయి. జిల్లాలో పార్టీ పరిస్థితి చూసి బీఆర్ఎస్ కేడర్ నైరాశ్యంలో మునిగిపోయింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా మరోసారి కాంగ్రెస్ కంచుకోట అని నిరూపించింది. లోక్ సభ ఎన్నికల్లో రికార్డు మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి రఘురాం రెడ్డి ఘన విజయం సాధించారు. అయితే ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ దారుణంగా దెబ్బతిన్నది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ తారుమారు అయింది. కేవలం ఆరు నెలల్లోనే ఆ పార్టీ గ్రాఫ్ పడిపోయింది. ఖమ్మం నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 86,635 ఓట్లు రాగా ఇప్పుడు ఎంపీ ఎన్నికల్లో 38,889 ఓట్లు మాత్రమే వచ్చాయి. సగానికి పైగా ఓటు బ్యాంక్ పడిపోయింది. ఇక్కడ బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ భారీగా బీజేపీకి క్రాస్ అయ్యింది. పాలేరు నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో 71710 ఓట్లు, ఎంపీ ఎన్నికల్లో 58,388 ఓట్లు వచ్చాయి. ఇక మధిర అసెంబ్లీ పరిధిలో 73,518, ఎంపీ ఎన్నికల్లో 50617 ఓట్లు వచ్చాయి. వైరా, సత్తుపల్లి, అశ్వరావుపేట, కొత్తగూడెం ఇలా ఏడు నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ తగ్గిపోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి తర్వాత బీఆర్ఎస్ మరింత చతికిల పడింది. బీఆర్ఎస్ నేతలు బలం చాటుకునేందుకు ప్రయత్నం చేసినా.. ఫలితం లభించలేదు. కాంగ్రెస్‌కి భారీ మెజార్టీ రావడానికి ప్రధాన కారణం లోక్ సభ **మిగతా 2 లో..**



## జూలై 9న బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం

- 10వ తేదీ రథోత్సవం
- ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ
- పెద్దఎత్తున తరలి రానున్న భక్తులు



**హైదరాబాద్, జూన్ 23, ( ప్రజాస్వరం):** భాగ్యనగర వాసులకు కొంగు బంగారంగా ప్రసిద్ధిగాంచిన బల్కంపేట్ ఎల్లమ్మ కల్యాణోత్సవం కూడా ఆషాఢ మాసంలో అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. హిందూ తెలుగు చాంద్రమానం ప్రకారం బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం ఆషాఢ మాసం మొదటి మంగళవారం రోజు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. బల్కంపేట్ ఎల్లమ్మ కళ్యాణం. ఈ ఏడాది అమ్మవారి కల్యాణాన్ని 2024 తేదీ జూలై 9న నిర్వహించనున్నారు. మర్నా డు అంటే జూలై 10న రథోత్సవాన్ని జరపను న్నారు. పిలిస్తే పలికే దైవంగా భావించే ఎల్లమ్మ దేవిని రేణుకా దేవి, జలదుర్గా అని కూడా పిలుస్తారు. ఎందుకంటే అమ్మవారి విగ్రహం దాదాపు 10 అడుగులు భూమి క్రింద నీటితో చుట్టుముట్టబడిన శయన స్థితిలో ఉంటుంది. ఎల్లమ్మ తల్లి కల్యాణం శక్తి మాతను మహాదేవ శివయ్యతో జరిపిస్తారు. ఈ కల్యాణం చూసి తీర్థప్రసాదాలు స్వీకరించిన భక్తుల కోరిన కోర్కెలు తీర్చడంతోపాటు పలు అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుందని నమ్మకం. ఎందుకంటే అమ్మవారి వార్షిక ఉత్సవాలకు వేలాది మంది భక్తులు తరలివస్తారు. ఎల్లమ్మ కల్యాణోత్సవానికి అమ్మవారికి పట్టు వస్త్రాలను తెలంగాణ ప్రభుత్వం అందజేస్తుంది. కల్యాణం జరిగిన మర్నాడు వార్షిక రథోత్సవం జరుగుతుంది. ఉత్సవాల్లో భాగంగా భక్తులు వివిధ రకాల నైవేద్యాలను సమర్పిస్తారు. ప్రధానంగా అమ్మవారికి చీరలు, గాజులతో పాటు ఇతర సౌందర్య ఉత్పత్తులను నైవేద్యంగా సమర్పిస్తారు. కొంతమంది భక్తులు వేప ఆకులతో అలంకరించిన పాల కుండలను తీసుకువెళతారు. ఉత్సవాల్లో పసుపును విరివిగా ఉపయోగిస్తారు.



# దర్యాప్తులు స్పీడప్..

- గత ప్రభుత్వ పాలనలో అవినీతిపై విచారణలు వేగవంతం
- ఒక్కో డిపార్ట్ మెంట్ పై దృష్టి సారిస్తున్న కాంగ్రెస్ సర్కారు
- కాళేశ్వరం ప్రాజెక్టు దుస్థితిపై జస్టిస్ ఘోష్.. విద్యుత్ కొనుగోళ్లపై జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి కమిషన్
- గొర్రెల స్కీం లో రూ. 700 కోట్ల అవినీతి జరిగిందంటున్న ఏసీబీ


**హైదరాబాద్, జూన్ 23, (ప్రజాస్వరం)** తెలంగాణలో నోటీసులు.. విచారణలు.. ఆరోపణలు, అనుమానాలపై దర్యాప్తులు. మేడిగడ్డ నుంచి మొదలు పెడితే.. అన్ని శాఖల్లో జరిగిన అవకతవకలపై విచారణలను నడుస్తున్నాయి. ఇన్నాళ్లు అదిగో.. ఇదిగో అన్న ప్రచారాలు నేడు నిజాలవుతున్నాయి. పదేళ్ల బీఆర్ఎస్ పాలన. అభివృద్ధి మాట ఏమో కానీ.. అరాచకాలు, అక్రమాలు, అవినీతికి కేరాఫ్‌గా నిలిచాయి. ఇది మేం అంటున్న మాట కాదు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న వ్యాఖ్యలు.. చెబుతున్న మాటలు.. తాము కేవలం మాటలు మాత్రమే చెప్పం.. అన్నింటిని వెలికితీస్తాం.. బీఆర్ఎస్ నేతల బాగోతాలను బయటపెడతాం అంటూ ప్రభుత్వ పెద్దలు ఇప్పటికే అనేక సందర్భాల్లో చెప్పారు. చెప్పినట్టుగానే విచారణ కమిషన్‌లకు ఆదేశించారు. మొదటగా కాళేశ్వరం ప్రాజెక్ట్ తీసుకుంటే.. ఈ ప్రాజెక్ట్‌లోని మూడు కీలక బ్యారేజ్‌లు ఇప్పుడు ఎందుకూ పనికి రాకుండా పోయాయి. మేడిగడ్డ కుంగిపోయింది. ప్రస్తుతం అక్కడ రిపేర్లు కూడా కొనసాగుతున్నాయి. కానీ అసలు ఈ పరిస్థితి ఎందుకొచ్చింది? అనే దానిపై జస్టిస్ పీసీ ఘోష్ హెడ్‌గా ఓ కమిషన్ విచారణ జరుపుతోంది. అయితే ఈ కమిషన్ డెడ్‌లైన్ ఈ నెల 30తో ముగుస్తుంది. మరి విచారణ పూర్తైందా? దీనికి ఆన్సర్ నో అనే చెప్పాలి. నెల రోజులైంది ఈ కమిషన్ విచారణ ప్రారంభించింది. ఈ టైమ్‌లో ప్రాజెక్ట్‌ను విజిట్ చేసింది కమిషన్.. ఇప్పటి వరకు 54 ఫిర్యాదులు అందాయి. అందులో నష్టపరిహారానికి సంబంధించినవి కూడా ఉన్నాయి. అధికారులను విచారిస్తున్నారు. కాబట్టి విచారణ ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని చెప్పాలి. అంటే డెడ్‌లైన్ లోపు విచారణ పూర్తి కాదు. ఇదే విషయాన్ని చంద్రఘోష్ కూడా చెబుతున్నారు. అసలు విషయాలు, నిజాలు తెలుసుకోకుండా పూర్తి నివేదిక ఇవ్వలేమంటు న్నారు ఆయన.. అంటే కమిషన్ డెడ్‌లైన్ ఎక్స్‌టెంట్ అవ్వడం కన్ఫామ్ అనే చెప్పాలి.

జస్టిస్ పీసీ ఘోష్ బ్యారేజీల పరిశీలిస్తూనే.. బాధ్యులపై ఫోకస్ చేస్తున్నారు. ప్లానింగ్, డిజైన్స్, కన్‌స్ట్రక్షన్స్‌తో పాటు.. టెయిల్ వాటర్, షూటింగ్ వెలాసిటీపై ఆరా తీస్తుంది. దీనికి సంబంధించి ప్రాజెక్ట్ ఇంజినీర్స్‌తో ఎప్పటికప్పుడు సమాచారం తీసుకుంటుంది. అటు నిర్మాణ సంస్థల ప్రతినిధులపై కూడా ప్రశ్నల వర్షం కురిపిస్తోంది కమిషన్.. అసలు బుంగలు ఎలా పడ్డాయి? ఎందుకు పడ్డాయి? ఎవరి నిర్లక్ష్యం దీనికి కారణం? ఇలా ప్రతి ఒక్క విషయంపై ఫోకస్ చేస్తుంది కమిషన్.. ప్రస్తుతం అధికారులు, నిర్మాణసంస్థల వరకు వెళ్లింది కమిషన్. మరి ముందు ముందు ఎవరి మెడకు చుట్టుకుంటుందో చూడాలి. ఆ తర్వాత విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలు, వాటి కోసం చేసిన అప్పులు.. దీనిపై కూడా జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి కమిషన్ కూడా విచారణ జరుపుతోంది. ఈ కమిషన్ కూడా దర్యాప్తును స్పీడప్ చేసింది. ప్రస్తుత, మాజీ అధికారులను విచారిస్తూనే ఉంది. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణం..ఛత్తీస్‌ఘడ్ నుంచి విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందంపై కమిషన్ మెయిన్‌గా ఫోకస్ చేసింది. ఇంధనశాఖ మాజీ కార్యదర్శి అర్వింద్ కుమార్.. మాజీ ట్రాన్స్–జెన్కో సీఎండీ ప్రభాకర్ రావుపై ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. అయితే ప్రస్తుతం తాజా, మాజీ ఉన్నతాధికారులకు మాత్రమే నోటీసులు జారీ అయ్యాయి ఇక ముందు ముందు మరింత మందికి ఈ నోటీసులు, విచారణలు విస్తరించనున్నాయి.

ఇక గొర్రెల స్కామ్ కేసులో ఇప్పటికే అరెస్టైన మాజీ పశుసంవర్ధక శాఖ ఎండీ రాంచందర్ నాయక్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ OSD కల్యాణ్‌ను ఏసీబీ అధికారులు కస్టడీకి తీసుకున్నారు. మూడు రోజుల పాటు వారిని కస్టడీకి పర్మిషన్ ఇచ్చింది నాంపల్లి కోర్టు. గొర్రెల పంపిణీలో ఏకంగా రూ 700 కోట్ల అవినీతి జరిగిందని ఏసీబీ చెబుతోంది. గొల్ల కురుమలకు బదులుగా.. ప్రైవేట్ వ్యక్తుల అకౌంట్స్‌లోకి నిధులు మళ్లించి డబ్బును దోచేశారు. ఇప్పటి వరకు మొత్తం 10 మంది నేతలను గుర్తించగా.. ఆరుగురిని అరెస్ట్ చేశారు. అయితే ఇప్పుడు ఏసీబీ విచారణతో మరికొంత మంది పెద్దల పేర్లు బయటికి వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఎందుకంటే ప్రస్తుతం కస్టడీలో ఉన్న వారిలో **మిగతా 2 లో..**

# కొంపముంచిన షాడో సీఎం

## చుట్టూ ఉండే కోటరీనే జగన్‌కు శాపమైందా..?



**విజయవాడ, జూన్ 23 (ప్రజాస్వరం):** ఆంధ్రప్రదేశ్ లో మొన్న జరిగిన ఎన్నికలు వైసీపీ కొంప ముంచాయి. జగన్ మ్యానియా పని చేస్తుందని, సంక్షేమ పథకాలు గట్టెక్కిస్తాయని.. సామాజిక న్యాయం తమకు న్యాయం చేస్తుందని భావించిన వైసీపీ చివరికి చతికిల పడింది. 2019లో 151 సీట్లు ఇచ్చిన ప్రజలు.. 2024 ఎన్నికల్లో 11 సీట్లకు పరిమితం చేసి దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అయ్యే తీర్పు నిచ్చారు. ఈ తారుణంలోనే ఓటమికి గల కారణాలను ఎవరికి నచ్చినట్లు వాళ్లు ఆలోచిస్తున్నారు. కానీ అన్నంటికంటే అసలు కారణం జగన్ చుట్టూ ఉండే కోటరీ అనేది జగమెరిగిన సత్యం. జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు చేసిన ప్రతి పనిలో జగన్ కి 10 శాతం ప్రమేయం ఉంటే చుట్టూ ఉండే కోటరీది 90 శాతం పాత్ర ఉంటుంది. అటు ప్రజలతో పాటు ఇటు పార్టీ నేతల్లో కూడా జగన్ పై వ్యతిరేకత రావడానికి ప్రధాన కారణం కోటరీలో ఉండే ఆ ఇద్దరే అని నేతలంతా గళం విప్పుతున్నారు. వారి వల్లే ఈ స్థాయిలో పార్టీ దెబ్బతిందని వైసీపీ నాయకులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. కనిపించే సీఎం జగన్ ఒకరైతే.. కనపడని షాడో సీఎం మరొకరు ఉన్నారు. సీఎం తర్వాత తానే సీఎం అనేంత రేంజిలో బిజీబిజీగా గడుపుతూ.. ప్రతి ప్రభుత్వం మీటింగ్ లోనూ.. ప్రైవేట్ మీటింగ్ లోనూ తానే కనపడేవారు. ఈ తరహా వైఖరిపై విమర్శలు వస్తున్నప్పటికీ.. మళ్లీ అదే రిపీట్ చేస్తూ.. చివరికి పార్టీ పతనానికి కూడా ఒక కారణం అయ్యారు. అతనే ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి.ప్రభుత్వంలో ఏ నిర్ణయం తీసుకున్నా.. ఎవరికి మంత్రి పదవులు రావాలన్నా.. ఎవరికైనా పోస్ట్ కేటాయించాలన్నా.. చిన్న స్థాయి నుంచి పెద్ద స్థాయి అధికారుల వరకు.. బదిలీ చేయాలన్నా సజ్జల అనుమతి లేనిదే.. సీఎం జగన్ చేయడమే టాక్ పెద్ద ఎత్తున నడిచింది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిన్నా మొన్నటి వరకు కూడా ఇదే నడిచిందని బాహాటం గానే సొంత నేతలు సైతం విమర్శలు గుప్పించారు.

సజ్జల రామకృష్ణారెడ్డి వల్లే పార్టీ ఇంతలా దిగజారి పోయిందని.. 11 సీట్లకే పరిమితం అయ్యిందని ఫైర్ అవుతున్నారు.ఉపాధ్యాయులు, ఉద్యోగులు, అంగన్వాడీలు, ఆశ వర్కర్స్.. ఇలా ఎవరితో చర్చలు జరిగిన.. ప్రతి సందర్భంలోనూ సజ్జల వీరు ఎవరు తమ ఓటు బ్యాంకు కాదని కించ పరిచే విధంగా మాట్లాడేవారు. ఈ మాటలే ఎన్నికల్లో రిఫ్లెక్ట్ అయ్యాయని చాలా మంది భావిస్తున్నారు. ఆయన మాట్లాడిన తీరు వల్లే వారి ఓటు బ్యాంక్ అంతా చేజారిందని వాపోతున్నారు. పార్టీ ఓటమికి పూర్తి బాధ్యత అంతా సజ్జల పైనే ఉంటుందని సొంత నేతలే నిప్పులు చెరుగుతున్నారు.సజ్జల తర్వాత ఆ స్థాయిలో పార్టీ ఓటమికి కారణమైన వ్యక్తి ఎవరా అంటే.. సీఎంఓలో ఉండే దనుంజయ రెడ్డి వైపే అందరి వేళ్లు చూపిస్తున్నాయి. ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తూ.. అన్ని నిర్ణయాలు తానే తీసుకుంటూ.. అరాచకాలు చేసుకుంటూ ముందుకు వెళ్తుంటే దానికి ధ్రువీకరణ పత్రం ఇచ్చింది ధనుజయ రెడ్డి అని చెబుతున్నారు.

నిర్ణయాలు సజ్జలు తీసుకుంటే ఆర్డర్లు ధనుంజయ రెడ్డి ఇచ్చేవారని... అధికారులు మొత్తాన్ని తన గుప్పెట్లో పెట్టుకున్నారని మండిపడుతున్నారు. జగన్ ఓటమికి కారణమైన ప్రతి తప్పులో ధనుంజయ రెడ్డి హస్తం కూడా ఉందని బహిరంగం గానే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ వ్యవహారంపైనే వైసీపీ మాజీ ఎమ్మెల్యే మీడియా సాక్షిగా కుండబద్దలు కొట్టేలా మాట్లాడడం ఈ ఆరోపణలను నిజం చేస్తున్నాయి. వైసీపీ ఓటమి తర్వాతహ ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడిన రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా.. ధనుంజయ రెడ్డిపై తీవ్రమైన విమర్శలు చేశారు. సీఎం జగన్ ని కలిసే అవకాశం కూడా తమకి ఇవ్వలేదని.. తానే సీఎం లాగా బిహేవ్ చేసే వారని ఆందోళన వ్యక్తం చేశారు.మొత్తానికి సజ్జల రామకృష్ణారెడ్డి, ధనుంజయ్ రెడ్డి కలిసి పార్టీ నాశనానికి కృషి చేశారే తప్ప.. ఎదుగుదలకు ఎక్కడ ఉపయోగపడలేదని తీవ్ర ఆరోపణలైతే వినపడుతున్నాయి

# కులగణన దిశగా అడుగులు

**వరంగల్, జూన్ 23, (ప్రజాస్వరం) :** తెలంగాణలో దశాబ్దాలుగా డిమాండ్ చేస్తూ వస్తున్న కులగణనపై కసరత్తు ప్రారంభమయింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఇతర సామాజిక వర్గాలకు సంబంధించిన కుల సర్వే చేయడానికి గతంలోనే అసెంబ్లీలో అమోదం లభించింది. ఈలోగా ఎన్నికల కోడ్, పార్లమెంట్ ఎన్నికల హడావిడితో కులగణన అంశం పెండింగ్ లో ఉండిపోయింది. అయితే రాష్ట్రంలో చేపట్టబోయే కులగణనకు దాదాపు అన్ని పార్టీలు సుముఖంగానే ఉన్నాయి. కేంద్రంలో బీజేపీ సర్కార్ అంత సానుకూలంగా లేకపోయినా తెలంగాణలో రాష్ట్ర నేతలు మాత్రం కులగణనకు మద్దతు తెలుపుతునే ఉన్నారు. ఈ మేరకు కులసర్వే విధివిధానాల అమలు పద్దతులు, ప్రశ్నావళి రూపకల్పన తదితర పద్ధతులపై బీసీ కమిషన్ చర్యలు మొదలుపెట్టింది. ఇటీవల జరిగిన సమావేశంలో బీసీ కమిషన్ సభ్యులతో పీపుల్స్ కమిటీ భేటీ అయింది. కులగణనపై ఏ రకంగా ముందుకు వెళ్లాలనే అంశంపై చర్చ జరిపారు. స్థానిక ఎన్నికలు జరిగే లోపే రాష్ట్రంలో కులగణన ప్రక్రియ పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది.అసలు ఈ కులగణన ఏమిటి? దీని వలన వచ్చే లాభం ఏమిటి? దాని ఆవశ్యకత ఏమిటి అని చాలా మందికి సందేహాలున్నాయి. భారత దేశంలో మొట్టమొదటిసారి 1931లో బ్రిటిష్ కాలంలోనే కులగణన జరిగింది. అప్పటికి పాకిస్తాన్, బంగ్లాదేశ్ దేశాలు కూడా భారత్ లోనే కలిసివున్నాయి. ఆ తర్వాత ఇప్పటిదాకా ఏ ప్రభుత్వం కూడా కులగణన అంశాన్ని సీరియస్ గా తీసుకోలేదు. పైగా 1941 జనాభా లెక్కల నుంచి ఈ కేటగిరీనే తీసివేశారు. చదువు, ఉద్యోగాల కోసం దరఖాస్తులలో కులం కేటగిరీని చేర్చారు. కేవలం ఆ లెక్కల ఆధారంగానే ఇప్పటిదాకా ఇంత మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, తదితరులు ఉన్నారని లెక్కలు వేస్తూ వస్తున్నారు. వీటి ఆధారంగానే ప్రభుత్వ సంక్షేమ పథకాలు సైతం అమలుచేస్తూ వస్తున్నారు. అయితే ఇవన్నీ అధికారిక లెక్కల కిందకి రావు.

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 2011–12లో సామాజిక, ఆర్థిక, కులగణన చేపట్టింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వం. అయితే ఆ లెక్కలేవీ ఇప్పటిదాకా బయటకు రాకపోవడం గమనార్హం. సాధారణంగా జనాభా లెక్కల్లో కేవలం ఎస్సీ, ఎస్టీ జనాభా ను మాత్రమే లెక్కలేస్తారు. కానీ అన్ని సామాజిక వర్గాల జీవన స్థితిగతులు ముఖ్యంగా ఆర్థిక, ఉపాధి, ఉద్యోగ, వ్యవసాయ, సంఘటిత, అసంఘటిత వ్యాపార రంగాలను కూడా ప్రాతిపదికన తీసుకోవాలి. అలా జరిగినప్పుడే అన్ని వర్గాలకు లబ్ధి చేకూరే అవకాశం కలుగుతుంది. మనదేశంలో జనాభా లెక్కలు మొదలైన కొత్తలో ఎక్కువమంది ప్రజలు వ్యవసాయం, కుటీర పరిశ్రమలు, కులవృత్తులు, చిరువ్యాపారాలు, కూలీపనులు చేస్తూ బతికేవాళ్లు. కానీ.. స్వాతంత్రం వచ్చాక ఆధునిక పరిశ్రమలు, సేవారంగం విస్తరించాయి. అనాదిగా ఉన్న అనేక వృత్తులు అదృశ్యమైపోతున్నాయి. చిరు వ్యాపారులు తమ అవకాశాలు కోల్పోతున్నారు.



కార్పొరేట్ వ్యాపార సంస్థల వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాబిన్నమై పోయిన విషయం స్పష్టంగా కనిపిస్తోంది. నూతన ఆర్థిక విధానాల వల్ల ఆర్థిక అసమానతలు అనేక రెట్లు పెరిగాయని అనేక జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా సంస్థలు చెప్తున్నాయి. కాబట్టి ఇప్పటి పరిస్థితులు ఎలా ఉన్నాయనేది తెసుకోవాల్సిన, అన్ని కులాల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, ఉపాధి, ఉద్యోగ పరిస్థితులపై ఒక సమగ్ర అంచనా వేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏ టెక్నాలజీ, సరైన ప్రభుత్వం, అధికార యంత్రాంగం లేని టైం1881లోనే కులగణన జరిగింది. అలాంటిది ఇప్పుడు పటిష్టమైన ప్రభుత్వాలు, అధికారులు, టెక్నాలజీ సపోర్ట్ గా ఉండగా ఇప్పుడు కులగణన చేయడం అంత పెద్ద కష్టమేమీ కాదు. ఇప్పటికే బీహార్, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో కులగణన చేశారు.

కానీ.. వాటికి ఆ ప్రభుత్వాలు పెట్టిన పేర్లే వేరు. రాష్ట్రాలకు తగిన అధికారం లేకపోవడం వల్ల సర్వే పేరుతో కులగణన చేస్తున్నారు. కాకపోతే.. వీటి లో తెలంగాణతో పాటు మరికొన్ని రాష్ట్రాలు ఆ డాటాను బయటపెట్టలేదు. అయితే.. ఈ గణనలో కులం ఒక్కటే కాకుండా ఆ కుటుంబాల సమగ్ర పరిస్థితి కనుక్కోవాలి. అప్పుడే వాళ్లు ఏ పరిస్థితుల్లో ఉన్నారు? వాళ్ల కోసం ప్రభుత్వాలు ఏం చేయాలి? అనేది తెలుస్తుంది.

# అమరావతిలో భూముల ధరలకు రెక్కలు

### నాలుగేళ్ల పాటు రియల్ ఎస్టేట్ నేలచూపులు
### కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో జోరందుకోనున్న క్రయవిక్రయాలు
### మళ్లీ తెరుచుకోనున్న రియల్ ఎస్టేట్ సంస్థలు



**విజయవాడ, జూన్ 23, (ప్రజాస్వరం):** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. గత అయిదేళ్లుగా చతికిలపడిన భూముల రేట్లు కూటమి ప్రభుత్వం విజయం సాధించడంతో రాజధాని ఆశలతో తిరిగి పుంజుకున్నాయి. నిజం చెప్పాలంటే 2023 డిసెంబరు నెల నుంచే తిరిగి చంద్రబాబే ముఖ్యమంత్రి కానున్నారనే టాక్ రావడంతో నిర్జీవమైన భూముల ధరల్లో చలనం కనిపించింది. మూడు రాజధానుల అంశాన్ని గత ప్రభుత్వం తెరపైకి తేవడంతో.. ఏపీ రాజధాని అమరావతితో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో భూముల ధరలు దాదాపు నాలుగేళ్లపాటు నేల చూపులు చూశాయి. ఇక్కడి రియల్ ఎస్టేట్ సంస్థలు దాదాపు మూతపడే పరిస్థితికొచ్చాయి. భూములు కొనుగోళ్ల పరిస్థితి అటుంచితే.. కనీసం అపార్ట్ మెంట్లలో ఫ్లాట్లు వైపు సైతం చూసేవారు లేని పరిస్థితి నెలకొంది. కానీ కొన్ని నెలల నుంచి పరిస్థితిలో మార్పు కనిపించింది. వైసీపీ ప్రభుత్వంపై రాజధాని అమరావతి ప్రజల్లో కూడగట్టుకున్న వ్యతిరేకత సైతం కూటమికి ఓటు వేసేలా చేసింది. చంద్రబాబు చేతికి తిరిగి పగ్గాలొస్తాయన్న భావించి, చంద్రబాబు సీఎం అయితే అమరావతినే రాజధానిగా అభివృద్ధి చేస్తారనే ప్రచారం జరిగింది. ఈ ప్రచారం ధరలు పెరిగేలా చేయడానికి కారణమైంది.

గడిచిన ఆరు నెలల్లో అమరావతి రాజధాని ప్రాంతమైన తుళ్లూరు మండలం తుళ్లూరు, వెలగపూడి, మందడం, రాయపూడి తదితర గ్రామాలు, మంగళగిరి మండలంలోని కృష్ణాయపాలెం, నిడమర్రు, కురగల్లు తదితర ప్రాంతాలు, తాడేపల్లి మండలం లోని పెనుమాక, ఉండవల్లి తదితర ప్రాంతాల్లో మొన్నటి వరకు రూ. 3,500 నుంచి రూ.4,000 వరకు ఉన్న గజం భూమి ఏకంగా రూ.45 వేలకు చేరిపోయిందని ఇక్కడి రియల్టర్లు చెబుతున్నారు. ఇక్కడ ఎకరం భూమి కొనాలంటే 15 నుంచి 20 కోట్లు వెచ్చించాల్సిన పరిస్థితి ఉందంటున్నారు. సమీపంలోని గుంటూరు, విజయవాడ వంటి నగరాల్లోనూ రియల్ వ్యాపారాలు పుంజుకున్నాయి. ఈ నెల ఒకటో తేదీ వరకు డబుల్ బెడ్రూం ఫ్లాట్లు రూ.40 లక్షల నుంచి 45 లక్షల మధ్య ఉండగా ఇప్పుడు 50 లక్షలు పైమాటే పలుకుతున్నాయంటున్నారు. నిర్మాణంలో ఉన్నవాటిని హాట్ కేకుల్లా అమ్ముతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎటు చూసినా రియల్టర్ల హడావుడి, ప్రాంతాన్ని బాగుచేస్తోన్న కార్మికుల గలగలతో సందడి వాతావరణం నెలకొంది. జూన్ 4న కూటమికి విజయాన్ని అందిస్తూ ఎన్నికల ఫలితాలు రావడంతో.. అమరావతి ప్రాంత రైతులు, ప్రజల ఆశలు, కలలు నిజమయ్యాయి. దాదాపు 1600 రోజులకు పైగా సుదీర్ఘంగా సాగిన అమరావతి రాజధాని ఉద్యమానికి తెరపడినట్లయింది. సరికొత్త ఆంశాలతో రాజధాని ప్రాంతమంతా ఊపిరి తీసుకుంది. అమరావతి ప్రాంతంలో కూటమి గెలుపు దరిమిలా నేతల నుంచి సంకేతాలు వెళ్లడంతో అధికారులు బాగుచేత పనులు ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో తుప్పు బట్టిపోయిన పరికరాలను పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నారు. తుమ్మచెట్లు కొట్టేస్తూ రహదారులు సైతం నిర్మిస్తున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన నేపథ్యంలో రాజధాని అంశంపై ఆయన చేసిన ప్రకటనలతో ఈ బూమ్ మరింత పెరిగింది. గత ప్రభుత్వం తీసుకున్న ఇసుక విధానంతో నిర్మాణ రంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో ముఖ్యంగా కూటమి ప్రభుత్వం ఇసుక విధానంపై సమీక్షించే అవకాశముందని భావిస్తున్నారు. తాజా పరిస్థితుల గతంలో రియల్ పెట్టుబడి పేరిగితే గతంలో హైదరాబాద్ వైపు చూసిన పెట్టుబడిదారులంతా ఇప్పుడు గుంటూరు, విజయవాడ పరిసరాల్లోనే కొనుగోలు చేస్తున్నారు. ఎలా చూసుకున్నా రియల్ బూమ్ ఊహించని విధంగా ఊపందుకుంది. కేవలం రాజధాని ప్రాంతమే కాకుండా.. రాజధాని ప్రాంతమైన గుంటూరు, విజయవాడ ప్రాంతాలకే రియల్ బూమ్ పరిమితం కాకుండా అటు ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు ఇటు ఉమ్మడి కృష్ణా జిల్లా, ఏలూరు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భూముల ధరలపై ప్రభావం పడే అవకాశముందని రియల్ రంగ నిపుణులంటున్నారు. ఇప్పటికిప్పుడు ఈ తేడా కనిపించకపోయినా రానున్న రెండు మూడు నెలల్లో ధరలు విపరీతంగా పెరుగుతాయని చెబుతున్నారు. రాజధాని ప్రాంతంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. మొన్నటి వరకూ రాత్రుళ్లు చీకటిగా ఉన్న సీడ్ యాక్సిస్ రోడ్డు ఇప్పుడు విద్యుత్తు వెలుగులతో తళతళలాడుతోంది. మంతెన సత్యనారాయణ రాజు ఆశ్రమం నుంచి రాయపూడి వరకూ ఉన్న సీడ్ యాక్సిస్ రోడ్డు 9 కిలోమీటర్ల మేర విద్యుత్తు వెలుగులు పునరుద్ధరించేందుకు అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవడంతో సోమవారానికే సీడ్ యాక్సిస్ రోడ్డంతా విద్యుత్తు వెలుగులు సంతరించుకుంది. అమరావతికి పట్టిన గ్రహణం వీడిందని ప్రజలంతా సంబురాలు చేసుకుంటున్నారు.

# సంతానోత్పత్తిపై ప్రభావం చూపే మైక్రోప్లాస్టిక్

### ఒక గ్రామ్ కణజాలంలో 329.44 మైక్రోగ్రాముల మేర మైక్రోప్లాస్టిక్
### పురుష సంతానోత్పత్తిపై ప్రభావం .. న్యూ మెక్సికో వర్సిటీ అధ్యయనం



**హైదరాబాద్, జూన్ 23 (ప్రజాస్వరం):** మైక్రోప్లాస్టిక్ కారణంగా పురుష సంతానోత్పత్తిపై ప్రభావం చూపే ప్రమాదమున్నదని పరిశోధకుడు జియోజంగ్ యూ పేర్కొన్నారు. పురుషుడి సంతానోత్పత్తికి కీలకమైన వృషణాల్లోనూ మైక్రోప్లాస్టిక్ రేణువులను గుర్తించినట్టు యూనివర్సిటీ ఆఫ్ న్యూ మెక్సికో పరిశోధకులు తెలిపారు. మగ కుక్కలు, పురుషులపై ఈ అధ్యయనం చేసినట్టు పేర్కొన్నారు. కుక్కల తో పోలిస్తే పురుషుల వృషణాల్లో మూడు రెట్లు ఎక్కువగా మైక్రోప్లాస్టిక్ ఉన్నట్టు గుర్తించామన్నారు. వృషణాల్లో 12 రకాల మైక్రోప్లా స్టిక్ రేణువులను కనుగొన్నామని.. ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, బ్యాగ్స్ తయారీకి వాడే పాలీఇథైలీన్ (పీఈ), పాలీవినైల్ క్లోరైడ్ (పీవీసీ) కూడా ఇందులో ఉన్నట్టు వెల్లడించారు.ఒక్క వృషణాల్లోనే కాదు మనుషుల రక్తం, గుండె, ఆఖరికి గర్భిణుల మావిలో (పిండం) కూడా మైక్రోప్లాస్టిక్ అవశేషాలను కనుగొన్నట్టు పరిశోధకులు వెల్లడించారు. 62 మంది గర్భిణుల మావి నమూనాలను పరీక్షిస్తే.. ప్రతీ గ్రాము కణజాలంలో 6.5 నుంచి 790 మైక్రోగ్రాముల మేర మైక్రోప్లాస్టిక్ రేణువులను గుర్తించినట్టు వివరించారు. పురుషులలో 329.44 మైక్రోగ్రాములు కుక్కలలో 122.63 మైక్రోగ్రాములు ఉన్నట్లు గుర్తించారు.

# సిద్ధమవుతున్న సీఎం క్యాంపు ఆఫీసు

(మొదటి పేజీ తరువాయి)

స్థాయి క్యాంపు కార్యాలయం అవసరం ఏర్పడింది. దీనికోసం తొలుత నూతన కార్యాలయం నిర్మిస్తే ఎలా ఉంటుందనే కోణంలో అధికారులు అలోచించగా, దానికి ముఖ్యమంత్రి నో చెప్పినట్లు సమాచారం. తన కార్యాలయం కోసం అనవసరంగా ప్రజాధనం వెచ్చించటానికి బదులు.. ఉన్న భవనాల్లోనే ఏదో ఒకదానిని వాడుకుంటే సరిపోతుందని ఆయన సూచించారు. దీంతో అధికారులు పైగా ప్యాలెస్, పోలీస్ టవర్స్ కార్యాలయంతో బాటు పలు ప్రభుత్వ ఆఫీసులను అధికారులు పరిశీలించారు. వాటిలో భద్రత, సౌకర్యాల పరంగా కొత్త నిర్మాణాల అవసరమయ్యేలా ఉండటంతో, అంతిమంగా, జూబ్లీహిల్స్ లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం(ఎంసీఆర్ హెచ్ఆర్ డీసీ) అయితే బాగుంటుందనే అంచనాకు వచ్చారు. సుమారు 45 ఎకరాల్లో విస్తరించిన ఈ ప్రాంగణంలో ఒకేసారి దాదాపు 150 మంది కూర్చునే సామర్థ్యం కలిగిన నాలుగు హాళ్లు, 375 ఏసీ రూములు, పరిపాలక మండలి సమావేశం నిర్వహణకు వీలుగా బోర్డ్ రూమ్, 250 మంది కూర్చునే ఆడిటోరియం, అతిథులకు ఆశ్రయం ఇవ్వడానికి మంజీర, కృష్ణ, గోదావరి, తుంగభద్ర పేర్లతో వేర్వేరు బ్లాకులు ఉన్నాయి. ఈ ప్రాంగణంలో సీఎం క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేస్తే రోజువారీ జరిగే కార్యకలాపాలకు భద్రతా పరమైన ఇబ్బందులు కూడా ఉండవనే అంచనాకు వచ్చారు ఎంసీఆర్ హెచ్ ఆర్ డీసీ ప్రాంగణంలోని గుట్ట మీద ఉన్న బ్లాక్ లోకి సీఎం క్యాంపు కార్యాలయాన్ని మార్చితే, తక్కువ ఖర్చుతోనే దీనిని క్యాంపు కార్యాలయంగా వాడుకోవచ్చని భావించి, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పనులను రోడ్లు, భవనాల శాఖ పర్యవేక్షిస్తోంది. ప్రస్తుతం జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడి సమీపంలో రేవంత్ రెడ్డి నివాసం ఉంది. ఇప్పుడు అక్కడి నుంచే సచివాలయం, ప్రజాభవన్ కు వెళ్తున్నారు. ప్రస్తుతం సీఎం నివాసానికి, మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రానికి దూరం కూడా తక్కువ కావటం వల్ల రాకపోకలకు సులభంగా ఉంటుందని, ట్రాఫిక్ ఇబ్బందులూ ఉండవని, అలాగే, నగరం మధ్యలో ముఖ్యమంత్రి కార్యాలయం అందుబాటులోకి తీసుకు రావటం వల్ల సామాన్యులకూ అది వెసులుబాటుగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇక, ఇక్కడున్న మానవ వనరుల అభివృద్ధి సంస్థను ప్రజాభవన్ లోని మరో భవనంలోకి తరలించనున్నారని తెలుస్తోంది.

# ఖమ్మం కోలుకునేది ఎలా..?

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ పడిపోవడంతో పాటు బీఆర్ఎస్ ఓటు బ్యాంకును బీజేపీ క్రాస్ చేసింది. ఇక లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కి 2,99,082 ఓట్లు రాగా, గత అసెంబ్లీ ఎన్నికల్లో 4,67,639 ఓట్లు వచ్చాయి. దీంతో బీఆర్ఎస్ 1,68,557 ఓట్లు నష్టపోయింది. ఇందులో లక్షకు పైగా ఓట్లు బీజేపీకి క్రాస్ అయ్యాయి. ఇదిలా ఉంటే ఖమ్మం జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కేవలం భద్రాచలంలో మాత్రమే గెలిచింది. మిగతా 9 స్థానాల్లో కాంగ్రెస్, సీపీఐ అభ్యర్థులు విజయం సాధించారు. అయితే భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు కూడా ఆ తర్వాత కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో ఇప్పుడు ఖమ్మంలో మొత్తం 10 స్థానాలు కాంగ్రెస్ ఖాతాలోనే ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం నుంచి తేరుకోక ముందే లోక్ సభ ఎన్నికల్లో గట్టి దెబ్బ తగిలింది. దీంతో జిల్లాలో బీఆర్ఎస్ పరిస్థితి ఏంటనే చర్చ నడుస్తోంది. ఇక కేడర్ పూర్తి నైరాశ్యంలో మునిగి పోయింది.

# దర్యాప్తులు వేగవంతం

(మొదటి పేజీ తరువాయి)

ఒకరు మాజీ మంత్రి ఓఎస్డీ కాబట్టి.. ఆయన మెడకు ఈ కేసు చుట్టుకుంటుందా? అనే అనుమానాలు కనిపిస్తున్నాయి. స్కామ్ అయినా.. అవినీతి ఆరోపణలు అయినా.. అన్నింటి రూట్స్ కూడా బీఆర్ఎస్ పాలనలోనే ఉన్నాయి. అరెస్ట్ అయినవారు.. విచారణతో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో కూడా అప్పటి అధికార పార్టీగా ఉన్న బీఆర్ఎస్ పెద్దలు, నేతలే ఉన్నారు. మొత్తంగా చూస్తే విచారణ మాత్రం చాలా వేగంగా జరుగుతుంది. మరి ఇవి ఓ ముగింపు దశకు వచ్చే సరికి మరెంత మంది జాతకాలు మారతాయనేది చూడాలి.

# ప్రైవేటీకరణ ఆపేస్తారా..?




**విశాఖపట్టణం, జూన్ 23, (ప్రజాస్వరం) :** విశాఖ ఉక్కు...ఆంధ్రుల హక్కు అన్న నినాదంతో ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ను..2021లో అమ్మకానికి పెట్టింది కేంద్రంలోని మోదీ ప్రభుత్వం. ప్లాంట్ లో 100 శాతం వాటా విక్రయించడంతో పాటు రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ నుంచి వైదొలగాలని కేంద్రం నిర్ణయించుకుంది. స్టీల్ ప్లాంట్ మేనేజ్ మెంట్ బాధ్యతలతో సహా పూర్తిగా ప్రైవేటీకరించాలని నిర్ణయం తీసుకుంది. కేంద్ర నిర్ణయంతో భగ్గుమన్న కార్మిక సంఘాలు, వామపక్షాలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అప్పటినుంచి అలుపెరగని పోరాటాలు చేస్తూనే ఉన్నాయి. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ అంశంగా కూడా మారింది విశాఖ స్టీల్ ప్లాంట్ అంశం. అయితే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను కార్మిక సంఘాలు, స్థానికులు వ్యతిరేకిస్తున్నా కూడా ముందడుగే వేసింది కేంద్రం ప్రభుత్వం.అయిదేళ్లుగా విశాఖ ఉక్కు పరిశ్రమ పీకల్లోతు కష్టాల్లో కొట్టుమిట్టాడుతోంది. సొంత గనులు లేకపోవడంతో తరచూ ఉత్పత్తికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉద్యోగులు, కార్మికులకు జీతాలివ్వలేని పరిస్థితి కూడా నెలకుంటోంది. అయితే ఇటీవల ఏర్పడిన కేంద్రమంత్రివర్గంలో తెలంగాణకు చెందిన కిషన్ రెడ్డికి బొగ్గు, గనుల శాఖ మంత్రిగా.. ఏపీకి చెందిన శ్రీనివాసవర్మకు ఉక్కు, భారీ పరిశ్రమల శాఖల సహాయ మంత్రిగా ప్రధాని మోదీ అవకాశమిచ్చారు. దీంతో స్టీల్ ప్లాంట్ పై ఏపీ ప్రజల్లో మళ్లీ ఆశలు మొదలయ్యాయి. అప్పుల భారంతో కుంగిపోతోన్న ఉక్కు పరిశ్రమకు బొగ్గు గనులు కేటాయిస్తే...కష్టాలు తొలగే అవకాశముందని ప్లాంటు ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.విశాఖ స్టీల్ ప్లాంట్ మెడ మీద బీజేపీ కత్తి పెట్టి మూడేళ్లుగా బలహీనం చేస్తోందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. స్టీల్ ప్లాంట్ లో ప్రస్తుతం పూర్తి స్థాయి ఉత్పత్తి జరగడం లేదు. అందుకు అవసరమైన నిధులు, ముడిపదార్థాలు లేవు. ఇక్కడ ఏడాదికి 80 లక్షల టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయవచ్చు. దీని ద్వారా 50 వేల కోట్ల ఆదాయం వస్తుంది. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జీఎస్ టీ ద్వారా 18 శాతం అంటే రూ.9 వేల కోట్లు ఆదాయం వస్తుంది. అయితే ఇవన్నీ జరగాలంటే స్టీల్ ప్లాంటు నిర్వహణకు అవసరమైన నిర్వహణ మూలధనం సమకూర్చాలి. బ్యాంకుల నుంచి రుణం దొరకాలంటే.. రాష్ట్రపతి పేరిట ఉన్న ఉక్కు భూములను ఆర్ ఐఎన్ ఎల్ పేరిట మార్పించాలి. అప్పుడే సంస్థకు ఆర్థిక పరపతి పెరిగి మార్కెట్ లో రుణాలు లభిస్తాయి. ఇపుడు సరైన సమయం వచ్చింది కాబట్టి బీజేపీ తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకునేలా చేయాలని అధికార, కార్మిక సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. ఉక్కు శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసవర్మ. స్టీల్ ప్లాంట్ ఏపీ ప్రజలకు సెంటిమెంట్ అన్న ఆయన.. ప్రైవేటీకరణ ఆపేలా కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తానన్నారు. ప్రజలకు మేలు జరిగేలా అడుగులు వేస్తానని హామీ ఇచ్చారు.కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి ఊపిరి అందిస్తున్న టీడీపీ..స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రకటన విడుదల చేయించాలని పలు వర్గాలు కోరుతున్నాయి. కూటమి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపుతుందని నమ్మకంతో స్థానికులు భారీ విజయాన్ని అందించారని.. ఆ నమ్మకాన్ని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మరోవైపు రాష్ట్ర విభజన హామీలైన కడప, బయ్యారం స్టీల్ ప్లాంట్ ల ఏర్పాటు హామీలపై కూడా కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరుతున్నారు.

## జులై 22న కేంద్ర బడ్జెట్?

**న్యూఢిల్లీ జూన్ 23 :** పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు షెడ్యూల్ ఖరారయిందని తెలుస్తోంది. ఇవి జులై 22 నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు జరుగనున్నట్లు తెలుస్తోంది. కాగా తొలి రోజే కేంద్రం పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టనుందని సమాచారం. ఈ విషయాన్ని విశ్వసనీయ వర్గాలు తెలిపినట్లు కథనం.కొత్తగా ఏర్పడిన 18వ లోక్ సభ సమావేశాలు జూన్ 24 నుంచి జులై 3వ తేదీ వరకు జరుగుతాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. తొలి విడత సమావేశంలో సభ్యుల ప్రమాణస్వీకారం, స్పీకర్ ఎన్నికకు పట్టే సమయాన్ని మినహాయిస్తే పనిదినాలు కేవలం 5 రోజులే ఉంటాయి. ఈ స్వల్పకాలంలో బడ్జెట్ ప్రవేశపెట్టి, దానిపై చర్చించడం సాధ్యం కాదని భావించిన కేంద్రం వర్షకాల సమావేశాల్లో ప్రవేశపెట్టాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్, జూన్ 23 (ప్రజాస్వరం) :**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ప్రజాసంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి చేరేలా కృషి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్ కు ఆదేశించారు. ఆదివారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని హైదరాబాద్ లోని సీఎం నివాస గృహంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కలెక్టర్ తో మాట్లాడుతూ వెనకబడిన జిల్లాలో ప్రభుత్వ నిధులతో పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. వికారాబాద్ జిల్లాలో వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని సీఎం రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్‌కు సూచించారు.



## మేడ్చల్ పట్టణ కురుమ సంఘం నూతన అధ్యక్షుడిగా గౌర్ల మధు కురుమ

**కౌన్సిలర్ కొడే మహేష్ కురుమ..!**



**మేడ్చల్, జూన్ 23 (ప్రజాస్వరం) :**
మేడ్చల్ పట్టణ కురుమ సంఘం నూతన కమిటీని నియమించడం జరిగినది.మేడ్చల్ పట్టణ కురుమ సంఘం అధ్యక్షులుగా గౌర్ల మధు కురుమ,ఉపాధ్యక్షులుగా ఒగ్గు సురేష్ కురుమ,ప్రధాన కార్యదర్శిగా కౌడే శ్రీశైలం కురుమ,కోశాధికారిగా మైల భీరేందర్ కురుమ,జాయింట్ సెక్రటరీగా గుండ గణేష్ కురుమ,కార్యవర్గ సభ్యులు కౌడే వెంకటేష్ కురుమ,ఒగ్గు భాస్కర్ కురుమ,గౌర్ల మహేష్ కురుమ,మైల భూపాల్ కురుమ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఎన్నికైన నూతన కమిటీ సభ్యులను శాలువాతో సత్కరించి హార్ధిక శుభాకాంక్షలు తెలియజేసిన మేడ్చల్ జిల్లా కురుమ యువ నాయకులు,మేడ్చల్ మున్సిపాలిటీ 23వ వార్డు కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ గారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కురుమ సంఘం కమిటీ సభ్యులు కురుమ కుల చైతన్యం కోసం పాటుపడాలని,కురుమ సంఘం సభ్యులకు అన్ని రకాలుగా అండగా నిలవాలని,కురుమ సంఘం సభ్యులను రాజకీయంగా,ఆర్థికంగా ముందుకు తీసుకెళ్ళేవిధంగా కృషి చేయాలని పలు సూచనలు అందించిన కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ గారు.ఈ కార్యక్రమంలో కౌడే భిక్షపతి కురుమ,గౌర్ల ఎర్ర బీరప్ప కురుమ,మైల మల్లేష్ కురుమ,ఒగ్గు శంకర్ కురుమ,కౌడే నరేందర్ కురుమ,ఒగ్గు వెంకటేష్ కురుమ,గౌర్ల మల్లేష్ కురుమ,మైల మహేందర్ కురుమ,వడ్డేపల్లి నర్సింహ్మా కురుమ,గౌర్ల రాజు కురుమ,కౌడే నాగేందర్ కురుమ,గౌర్ల కృష్ణ కురుమ,ఒగ్గు వినోద్ కురుమ,మైల జీతయ్య కురుమ,వడ్డేపల్లి పోచయ్య కురుమ,కౌడే లక్ష్మణ్, మల్లేష్, ఓంకార్, రమేష్, రఘురాం, విజయ్, రాజు, నాగేష్, ఒగ్గురమేష్, వెంకటేష్, మహేష్,శ్రీకాంత్,విఘ్నేష్,గౌర్ల అశోక్,మహేష్,గోపాల్,సాయి కిరణ్,మైల జీతయ్య,మహేష్,శ్రీనివాస్,సాయి గుండ మల్లేష్,శ్రీధర్ కురుమ సంఘం నాయకులు,కార్యకర్తలు,ప్రజా ప్రతినిధులు,పుర ప్రముఖులు,మహిళలు యువకులు కురుమ కుల బాంధవులు పాల్గొన్నారు.

## పటాన్ చెరులో స్థానిక సమస్యల పరిశీలన

**పటాన్ చెరు జూన్ 23, (ప్రజాస్వరం) :**



పట్టణ పరిధిలోని పలు కాలనీలలో ఈరోజు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.పటాన్ చెరు లోని శ్రీరామ్ నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్య,రోడ్డు సమస్య ఉందని కాలనీవాసులు తెలియజేయగా,జిహెచ్ఎంసి పారిశుధ్య కార్మికులను నియమించి డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని అలాగే సీసీ రోడ్డు నిర్మాణ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లి రోడ్డు సమస్యను కూడా పరిష్కరిస్తామని కాలనీవాసులతో అన్నారు.

## అంత్యక్రియలకు సిద్ధం చేస్తుండగా మరణించిన వ్యక్తి ప్రత్యక్షం..!!

**వివరాలను గుర్తించక మరో వ్యక్తి శవాన్ని అప్పగించిన రైల్వే పోలీసులు**
**మృతి చెందాడనుకున్న వ్యక్తి బతికి రావడంతో అవాక్కయిన బంధువులు**
**వికారాబాద్ జిల్లా బషీరాబాద్‌లో చోటు చేసుకున్న విచిత్ర సంఘటన**

**వికారాబాద్, జూన్ 23 (ప్రజాస్వరం) :**



వికారాబాద్ జిల్లా తాండూర్ నియోజకవర్గంలోని బషీరాబాద్ మండల కేంద్రంలో ఆదివారం విచిత్ర సంఘటన చోటు చేసుకుంది. బషీరాబాద్ మండల కేంద్రంలో నివసించే ఎల్లప్ప అనే వ్యక్తి పశువుల కాపరిగా పనిచేసేవాడు.. గత రెండు రోజులుగా ఇంటి నుండి బయటికి వెళ్లిపోయాడు.. శనివారం రాత్రి ఎల్లప్ప కుటుంబ సభ్యులకు వికారాబాద్ రైల్వే పోలీసులు ఫోన్ చేసి, ఓ వ్యక్తి రైలు ఢీకొని చనిపోయాడు ..అతని వద్ద ఉన్న ఫోన్ తో మీకు సమాచారం ఇస్తున్నామని చెప్పగానే కుటుంబ సభ్యులు వెళ్లి పోస్టుమార్టం అనంతరం శవాన్ని ఇంటికి తీసుకువచ్చారు. తీరా అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగానే ఎల్లప్ప ప్రత్యక్షమయ్యాడు. ఎల్లప్ప బతికి ఉండటాన్ని చూసి అతని బంధువులు, గ్రామస్తులు ఒక్కసారిగా అవాక్కైనారు. రైల్వే పోలీసులు పొరపాటుతో మరో వ్యక్తి శవాన్ని అప్పగించడంతోని ఈ పరిస్థితి తలెత్తిందని తెలుస్తోంది. మరి ఎల్లప్ప బ్రతికి వస్తే..మరి చనిపోయిన వ్యక్తి ఎవరు అని సంశయం వ్యక్తం చేశారు. అయితే రెండు రోజుల క్రితం తాండూరులో ఓ వ్యక్తి నా ఫోను దొంగిలించాడని అతడే వికారాబాద్ వద్ద రైలు ఢీకొని చనిపోయి ఉంటాడని ఎల్లప్ప తెలిపాడు. దీంతో ఆ శవాన్ని కుటుంబ సభ్యులు తిరిగి వికారాబాద్ రైల్వే పోలీసులకు అప్పగించారు.. రైల్ ఢీకొనగా చనిపోయిన వ్యక్తి ముఖాన్ని కుటుంబ సభ్యులు గుర్తుపట్టలేకపోయారు.. ఏదేమైనా ఎల్లప్ప తిరిగి రావడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

## విద్యాదానం చాలా గొప్పది

**మేడ్చల్, జూన్ 23 (ప్రజాస్వరం) :**



అన్నిదానాల్లో కల్లా విద్యాదానం చాలా గొప్పదని, పేద విద్యార్థుల చదువు కోసం దాతల అందించే సాయం మరువలేమని బసురేగడి మాజీ ఉప సర్పంచ్ భాస్కర్ రెడ్డి అన్నారు. ఆదివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిదిలోని బసురేగడి ఎస్సి కాలనీకి చెందిన పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్ అందజేశారు. బసురేగడి ఎస్సి కాలనీకి చెందిన పేద విద్యార్థులకు పాఠశాలలు పునఃప్రారంభించడంతో పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్ కొనుగోలు చేయాలంటే తల్లిదండ్రులకు భారంగా మారడంతో పరిస్థితిని గమనించిన బసురేగడి గ్రామ మాజీ ఉప సర్పంచ్ భాస్కర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు ఇమ్మది ఆరోగ్యం పేద విద్యార్థులకు సహాయం చేయడానికి స్థానికంగా ఉన్న ఫ్యాన్ కంపెనీ యజమాని భాస్కర్ రావు దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఆయన విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు, దుస్తుల కోసం ఆర్థిక సహాయంగా సెట్ క్లారిటీ పాఠశాలకు రూ. 1లక్ష అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఉప సర్పంచ్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఎస్సి కాలనీ విద్యార్థుల పరిస్థితిని అర్థం చేసుకొని వారి భవిష్యత్తు బాగుండాలని గొప్ప మనస్సుతో పుస్తకాలు, దుస్తులు అందజేసిన ఫ్యాన్ కంపెనీ యజమాని భాస్కర్ రావు కు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు ప్రస్తుత పోటీ యుగంలో విద్యచాలా అవసరమని, దానిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు విద్యపై ప్రత్యేక దృష్టిసారించి చదువులో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు.

## శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివి

**- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ళ విక్రమ్ రెడ్డి**



**మేడ్చల్, జూన్ 23 (ప్రజాస్వరం) :**
దేశం కోసం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలు త్యాగాలను మరువలేనివని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ళ విక్రమ్ రెడ్డి అన్నారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా గుండ్లపోచంపల్లిలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ ఒకే ప్రధాని ఒకే జెండా ఒకే చట్టం అనే నినాదంతో జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ దేశం కోసం ప్రాణాలర్పించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు ఊషిగారి శ్రీనివాస్ ముదిరాజ్, మేడ్చల్ జిల్లా కన్వీనర్ అమర మోహన్ రెడ్డి. కౌన్సిలర్ మల్లికార్జున్, రజిత వెంకటేష్, నాయకులు కిషన్, మలిగే అశోక్,మధుసూదన్ రెడ్డి, చెంచాల సురేష్, కృష్ణ, ఆంజనేయులు, నాగరాజు, ప్రదీప్ రెడి, అరుణ్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ జిల్లాలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి



**వికారాబాద్, జూన్ 23 (ప్రజాస్వరం) :**
వికారాబాద్ జిల్లాలో ఘనంగా జనసంఘ్ నేత శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలోశ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి పురస్కరించుకొని పరిగి అసెంబ్లీ ఇంచార్జ్ మారుతి కిరణ్ వారికి ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈయన లేకుంటే భారతీయ జన సంఘ్ లేదు... జన సంఘ్ లేకుంటే లేకుంటే భారతీయ జనతా పార్టీ లేదు అని పరిగి అసెంబ్లీ ఇంచార్జ్ మారుతి కిరణ్ పేర్కొన్నారు. కాశ్మీర్ 370 ఆర్టికల్ రద్దు అనే ఎజెండా లేదు... కాశ్మీర్ పై నెహ్రూ చేసిన తప్పులపై ప్రశ్నించే గొంతు లేదు అని అన్నారు. ఒక దేశంలో రెండు విధానాలు ఏంటి ఇద్దరు ప్రధానులు ఏంటి అని ఆరోజు ప్రశ్నించకపోతే నేడు కాశ్మీర్ మన చేతిలో ఉండేది కాదు, దేశానికి ఆయువు లాంటి కాశ్మీర్ లేకపోతే దేశమే లేదు, నేడు భారతదేశంలో కాశ్మీరం ఉందంటే అది శ్యాం ప్రసాద్ ముఖర్జీ చేసిన ఉద్యమం అని తెలిపారు. ప్రశ్నించినందుకు ఎదురు తిరిగినందుకు నెహ్రు జైల్లోనే బంధించి ప్రాణం తీసిన దేశం కోసం బలిదానమైన శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా నివాళులు నివాళులు అర్పించారు.. భారతదేశంలో ప్రతి పౌరుడు గుర్తుంచుకోవాల్సిన నాయకుడు గుండెల్లో పెట్టుకొని స్మరించుకోవాల్సిన దేశభక్తుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడడం జరిగింది. వారి యొక్క సేవలను గుర్తు చేసుకుంటూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వారికి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఏక్ దేశమే దో విధాన్ దో ప్రధాన్ దో నిషాన్ నహి చలేగే నహి చలేగే అని గర్జించిన సింహం అతడు అని వారిని స్మరించుకోవడం చాలా ఆనందంగా ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని పలువురు యువకులు నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, జిల్లా యువ మోర్చా ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్, జిల్లా యువ మోర్చా ప్రోగ్రాం కోఆర్డినేటర్ అనిల్ కుమార్, ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి హరి , పరిగి పట్టణ నాయకులు అనిల్, రామ్ చందర్, తదితరులు పాల్గొన్నారు.

## సేవా పతకాలు పొందిన అధికారులకు ఎస్పీ అభినందన





**వికారాబాద్, జూన్ 23 (ప్రజాస్వరం) :**
జిల్లాలో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రభుత్వం నుండి ప్రశంస పతకాలు సాధించిన పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ కే. నారాయణ రెడ్డి అది వారం ఓ కార్యక్రమం లో అభినందించారు. జిల్లా స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌బీ నందు పని చేస్తున్న ఎస్ఐ అబ్దుల్ హాఫిజ్ కు ఉత్తమ సేవ పతకం మరియు డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో డి సీ ఆర్ బీ పని చేస్తున్న ఏ ఎస్ ఐ ఎం . రాజశేఖర్ కు సేవా పతకాలను ను ఇటీవల ప్రభుత్వం ప్రకటించడం జరిగింది అని జిల్లా ఎస్పీ తెలిపారు. పతకాలు సాధించిన అధికారులకు జిల్లా ఎస్పీ కే. నారాయణ రెడ్డి అభినందించడం జరిగింది.

# మురికిని తొలగించండి...ప్లీజ్...

**మసాయిపేట, జూన్ 22 (ప్రజాస్వరం) :**

మసాయిపేట మండల కేంద్రం లోని మురికి కాలువలలో ఎక్కడికక్కడ మురికి పేరుకు పోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది.ఆయా వార్డులలో మురికి కాలువలను కొన్ని నెలలు నించి క్లీన్ చేయక పోవడంతో దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు వాపోతున్నారు. స్థానిక అధికారులు దృష్టిపెట్టి ఇకనైనా మురికి కాలువలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచక పోవడంతో విష జ్వరాలు వ్యాప్తి చెందే ప్రమాదం వుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం కావడంతో రానున్న రోజుల్లో విష జ్వరాలు ప్రభలే ప్రమాదముందని ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.





## మొక్కలు నాటిన కార్పొరేటర్



**పటాన్ చెరు జూన్ 23, (ప్రజాస్వరం) :**

పటాన్ చెరులో ఆదివారం లయన్స్ క్లబ్ ప్రారంభించి మొక్కలు నాటారు.కార్యక్రమంలో పటాన్ చెరు కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ నానాటికీ పెరిగిపోతున్న కాలుష్యం తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మొక్కల పెంపకం ద్వారా మాత్రమే నియంత్రించడం సాధ్యమవుతుంది అన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం అలవాటుగా చేసుకోవాలని కోరారు.మొక్కలు నాటాలనే మంచి నిర్ణయం తీసుకున్నందుకు లయన్స్ క్లబ్ సభ్యులను పటాన్ చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ కు అభినందించారు.ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## సుదీర్ఘ చర్చ అనంతరం ఆర్టీసీ డ్రైవర్స్ చర్చలు సఫలం

### విధులకు హాజరుకానున్న ఆర్టీసీ డ్రైవర్స్



**మెదక్, జూన్ 23 (ప్రజాస్వరం) :**

ఆర్టీసీ డ్రైవర్స్ సమస్యలను అర్ ఎం దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని డిప్యూటీ ఆర్ ఎం, డిపో మేనేజర్ ఆధ్వర్యంలో చర్చలు అనంతరం ఎట్టకేలకు సఫలమయ్యాయనీ ఎస్ డబ్ల్యు యు, ఐ ఎన్ టి యు సి సెక్రటరీ జనరల్ హనుమంతు ముదిరాజ్ అన్నారు. మెదక్ ఆర్టీసీ డ్రైవర్ గత మూడు రోజులుగా విధులను బహిష్కరించి తమ సమస్యలను పరిష్కరించాలని శాంతియూత నిరసన వ్యక్తం చేయడం జరిగిందన్నారు. వారి సమస్యలు ఏవైతే ఉన్నాయో ఈ డి పురుషోత్తం నాయక్, ఆర్ ఎం దృష్టికి తీసుకు వెళ్లి డిప్యూటీ ఆర్ ఎం, డిపో మేనేజర్ తో చర్చించడం జరిగిందన్నారు. ఎట్టకేలకు వారు సానుకూలంగా స్పందించి కొన్ని సమస్యలను పరిష్కరిస్తామని తెలపడం జరిగిందన్నారు.

## శ్రీ లలితా పరమేశ్వరి ఆలయంలో వార్షికోత్సవ వేడుకలు



**తూప్రాన్, జూన్ 23, (ప్రజాస్వరం) :**

తూప్రాన్ మండలం వెంకటాపూర్ (పిటి)లో పరిదిలో గల శ్రీ లలితా పరమేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వ్యవస్థాపకులు సోమయాజుల రవీంద్ర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి మహా పూజ, చండీయాగం, మహాన్యాస పూర్వక శత రుద్రాభిషేకం, అమ్మవారి ఆశీస్సులతో చిన్నారులకు తులాభారం కార్యక్రమాలు నిర్వహించారు.

## జడ్పీ భేటీకి హాజరయిన మంత్రి కోమటిరెడ్డి

నల్గోండ : నల్లగొండ జిల్లా జడ్పీ సమావేశం హాట్ హాట్ గా కొనసాగుతుంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో.. విత్తనాలు, ఎరువుల సమస్యలు సహా త్రాగునీరు, వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు ఇతర సమస్యల మీద చర్చ జరిగింది. జడ్పీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి అధ్యక్షతన జరుగుతున్న ఈ మీటింగ్ కు.. ముఖ్య అతిథులుగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్రెడ్డి రోడ్లు భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరయ్యారు. కలెక్టర్ నారాయణ రెడ్డి తో పాటు.. పలువురు ఎంఎల్ఏ లు, జడ్పీటీసీ లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. తన సొంత గ్రామం బ్రాహ్మణ వెల్లంల లోనే మిషన్ భగీరథ నీళ్లు రావట్లేదని.. ఇక శివారు ప్రాంతాలు మిగతా గ్రామాల పరిస్థితి చెప్పనక్కర్లేదన్నారు. అప్పట్లో కాంట్రాక్టులు ప్రభుత్వంలో ఉన్నవారు అందన కాడికి దోచుకొని మిషన్ భగీరథను కమిషన్ భగీరథ గా మార్చాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.


## కీరదోస జ్యూస్‌తో అధిక బరువుకు చెక్..!

ఇప్పటి రోజుల్లో దాదాపు అందరూ ఎదుర్కొంటున్న సమస్య పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వు. శరీరంలో పేరుకుపోవడం వలన అనారోగ్య సమస్యలు మొదలవుతాయి.మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నబరువు తగ్గించుకోవాలన్నా మనం తీసుకునే ఆహారంలో మార్పు. ఎంతైనాఅవసరం.బరువు తగ్గించుకోవడం ప్రతి ఒక్కరికి అనివార్యంగా మారింది.చాలా మంది ఈ సమస్యతో బాధపడుతు న్నారు. అనేకమందిని ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. దీంతో గుండె సంబంధ వ్యాధులు హై బీపీ, డయాబెటిస్ వస్తున్నాయి. అలాంటివారు నిత్యం వ్యాయామం చేయాలి. దాంతోపాటు కింద చెప్పిన విధంగా రోజు తీసుకోవాలి. దీంతో అధిక బరువు బాణపొట్ట సమస్యలు రెండేటి నుంచి విముక్తి లభిస్తుంది. ఈ కీరదోస జ్యూస్ ఎలా తయారు చేసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.. కీర దోసకాయ తీసుకుని ముక్కలుగా కట్ చేయాలి. ఆ ముక్కల్లో ఒక నిమ్మకాయను పూర్తిగా రసం పిండాలి. ఒక టేబుల్ స్పూన్ అల్లం రసం, రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జ్యూస్, ఒక కప్పు నీటిలో ఆ మిశ్రమం వేయాలి. అనంతరం అన్నిటిని మిక్సీ పడితే జ్యూస్ తయారైనట్టే దీన్ని రోజు తాగడం వల్ల ఎన్నో లాభాలు కలుగుతాయి. అవేంటంటే.. కీరదోస జ్యూస్ ను రోజు తాగడం వల్ల శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ పోతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. డయాబెటిస్ అదుపులోకి వస్తుంది. బాన పొట్ట కరిగిపోతుంది. శరీరంలో ఉండే విష పదార్థాలు బయటికి వెళ్లిపోయి శరీరం శుభ్రంగా మారుతుంది. శరీరంలో అతిగా ఉండే నీరు తొలగిపోతుంది. సాధారణమైన కీరాలో సాధారణ గుణాలు ఉన్నాయి. కీరా లో శరీరానికి కావాల్సిన అనేక విటమిన్లు ఉన్నాయి. ఈ కీరాలో మెగ్నీషియం, సిలికాన్ తో పాటు ఇంకా అనేక పోషక పదార్థాలు ఉన్నాయి. ఈ పోషకాలు ఉండటం వల్ల శరీరం అనారోగ్యాల బారిన పడకుండా ఉంటుంది. మనకు రక్షణ కలుగుతుంది. ప్రతిరోజు కొన్ని కీర ముక్కల్ని తినడం వలన బరువు తగ్గుతారు. శరీరంలోని మలినాలు కూడా తొలగిపోతాయి



## చలికాలంలో వాకింగ్ మంచిదేనా..?

వాకింగ్ మన ఆరోగ్యానికి మేలు చేస్తుందనడంలో సందేహం లేదు. ఇది మీ జీవక్రియను పెంచుతుంది. మీ గుండె మరియు మెదడు ఆరోగ్యాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. అంతేకాదు శరీరాన్ని వెచ్చగా ఉంచుతుంది. బరువును అదుపులో ఉంచుకోవడంలో కూడా వాకింగ్ అద్భుతంగా సహాయపడుతుంది. అయితే, మార్నింగ్ వాక్ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి అందరికీ తెలిసిందే. అయినప్పటికీ, శీతాకాలం వచ్చిందంటే..చాల మంది వాకింగ్ వెళ్లడం మానుకుంటారు. చలిలో కొందరు తెల్లవారుజామున లేవలేక ఇబ్బంది పడుతుంటారు. , కొందరు వెచ్చని దుప్పట్లు కప్పుకుని బెడ్ మీద నుంచి కిందకు దిగాలంటే కూడా బద్ధకిస్తుంటారు. అదే సమయంలో కొంతమంది చలి నుండి తమను తాము రక్షించుకోవడానికి వాకింగ్‌కు వెళ్లకుండా ఉంటారు. అయితే, మీరు చలికాలంలో వాకింగ్‌కు వెళుతున్నట్లయితే, మీరు కొన్ని విషయాలను గుర్తుంచుకోవాలి. వాకింగ్ వెళ్లే ముందు మీరు మీ దుస్తుల జాగ్రత్తగా ఉండాలి. మిమ్మల్ని మీరు పూర్తి కప్పుకొని చలికాలంలో వాకింగ్ కోసం బయటకు వెళ్లండి. మంచి వెచ్చని దుస్తులను ధరించండి. తల నుండి కాళ్ల వరకు మిమ్మల్ని మీరు కవర్ చేసుకునేలా చూసుకోండి. మీరు గుర్తుంచుకోవలసిన రెండవ విషయం ఏమిటంటే, ఉన్నట్టుండి వేగంగా నడవడం లేదంటే పరుగెత్తడం చేయరాదు. ఇంటి నుండి బయలుదేరేటప్పుడు నెమ్మదిగా నడవడం ప్రారంభించండి.. ఆ తర్వాత మీరు నడకలో వేగాన్ని పెంచుకోవచ్చు. ఇకపోతే, చలిలో ఉదయాన్నే నిద్రలేవడం కొందరికి కష్టంగా ఉంటుంది. అటువంటి పరిస్థితిలో మీరు ఉదయం 8.30 నుండి 9.30 మధ్య లేదా సాయంత్రం 5 నుండి 6 గంటల మధ్య వాకింగ్‌కు వెళ్లాలని నియమం పెట్టుకోండి. ఈ సమయంలో చలి కాస్త తక్కువగా ఉంటుంది. అదే సమయంలో కొంతమంది చలికాలంలో వాకింగ్‌కు వెళ్లకపోవడమే ఉత్తమం.. మీకు గుండె సంబంధిత సమస్యలు, ఆస్తమా లేదా న్యుమోనియా ఉన్నట్లయితే, ఉదయాన్నే వాకింగ్ వెళ్లకండి. దీనితో పాటు, వృద్ధులు కూడా శీతాకాలంలో వాకింగ్‌కు వెళ్లకూడదు.



## సీతాఫలాలను ఎక్కువగా తింటున్నారా..?

మనకు శీతాకాలంలో దొరికే పండ్లలో సీతాఫలం కూడా ఒకటి. చాలామంది ఈ సీతాఫలాలను ఇష్టంగా తింటూ ఉంటారు. కొందరు అయితే కేజీలకు కేజీలు సీతాఫలం పండ్లను లాగించేస్తూ ఉంటారు.సీతాఫలం తినడం మంచిదే కానీ మితిమీరి ఎక్కువగా తింటే మాత్రం ప్రమాదం తప్పదు అంటున్నారు వైద్యులు. ఈ సీతాఫలం తినడానికి తియ్యగా ఎంతో అద్భుతంగా ఉంటుంది. అలాగే సీతాఫలం చెట్టులోని ఆకులు, బెరడు, వేర్లు ఇలా ప్రతి భాగంలో ఎన్నో ఔషధ గుణాలను కలిగి ఉంటుంది. ఈ గుణాలు శరీరంలో వ్యాధి కారకాలను తొలగించడానికి బాగా సహాయపడుతుంది. సీతాఫలంలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. కావున ప్రతిరోజు ఈ పండుని తినడం వలన శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. సీజనల్ గా వచ్చే అనేక వ్యాధులను ఈ సీతాఫలం పండ్లతో సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు. సీతాఫలం పండులో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. దీంతో రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పెరుగుతుంది. దీని ద్వారా అనీమియా వంటి వ్యాధులను దూరం చేసుకోవచ్చు. వంద గ్రాముల సీతాఫలంలో 94 క్యాలరీలు లభిస్తాయి. ఆపిల్, జామ, మామిడి బొప్పాయి బత్తాయి వంటి పండ్లతో పోలిస్తే అందులో క్యాలరీలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి తక్కువ బరువుతో బాధపడేవారు ప్రతిరోజు సీతాఫలాన్ని ఆహారంగా తీసుకుంటే శరీరానికి శక్తి నిచ్చి బరువు పెరగడంలో సహాయపడుతుంది.సీతాఫలం గుజ్జులో అధికంగా కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం ఎక్కువగా ఉంటాయి. క్యాల్షియం ఎముకలు బలంగా ఉండడానికి సహాయపడుతుంది. పొటాషియం రక్త ప్రసరణ వ్యవస్థను



మెరుగుపరిచి రక్తపోటుకు దూరంగా ఉంచుతుంది. సీతాఫలం పండులో నియాసిన్ ఎక్కువగా ఉంటుంది. ఇది చెడు కొలెస్ట్రాల్ తగ్గించడానికి సహాయపడుతుంది. తద్వారా గుండె జబ్బులు దీర్ఘకాయ వంటి సమస్యలకు దూరంగా ఉండవచ్చు. సీతాఫలం పండులో ఎసిటోజెనిన్ కెమికల్స్ చర్మ క్యాన్సర్ల నుండి కాపాడుతాయి. అలాగే ఈ పండులో ఉన్న ఫైబర్ జీర్ణవ్యవస్థను మెరుగుపరిచి మలబద్దకం, గ్యాస్ట్రిక్ వంటి సమస్యలను తగ్గిస్తుంది. సీతాఫలంలో అత్యధిక క్యాలరీలు ఉండడం వలన అధిక బరువు సమస్యతో బాధపడేవారు ఈ పండ్లను తినకూడదు. ఎక్కువగా తింటే క్యాలరీలు ఎక్కువగా ఉండడం వలన మరింత బరువు పెరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి ఈ పండ్లను అతిగా తినకపోవడం మంచిది.